ఆరు నెలలుగా మురుగే!



బాచుపల్లి చౌరస్తా నుంచి గండిమైసమ్మకు వెళ్లే మార్గంలో మురుగు

నిజాంపేట్: రెండుసార్లు వరుసగా స్వచ్ఛత అవార్డు అందుకున్న నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో పలు రోడ్లపై మురుగు పొంగుతోంది. మియాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వెళ్లే రహదారిలోని బాచుపల్లి చౌరస్తా దగ్గర ఐదారు నెలలుగా మురుగు నీరు ప్రవహిస్తోంది. అయినా అధికారులు స్పందించకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మియాపూర్ టు గండిమైసమ్మకు, జెఎన్టీయూ నుంచి నిజాంపేట్ మీదుగా మేడ్చల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ దారే ప్రధానం. అంతేకాకుండా బాచుపల్లి, మల్లంపేట్, బౌరంపేట్, దుండిగల్, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కాలేజీలు, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఉన్నాయి. దీంతో నిత్యం ఈ రహదారి వెంట వందలాది వాహనాలు తిరుగుతుంటాయి.

భయంతో ప్రయాణం

బాచుపల్లి చౌరస్తా సమీపంలోని నాలా నుంచి వస్తున్న మురుగు రహదారిపై నిలిచిపోతోంది. దీంతో ఈ ప్రాంతం మురుగు నీటి కాల్వను తలపిస్తోంది. దీంతో ఇటుగా వెళ్లే వాహనాల రాకపోకలు మందగిస్తున్నాయి. ఎటు వెళ్తే మురుగులో ఇరుక్కుంటామోనన్న భయంతో వాహనదారులు డివైడర్‌ను ఆనుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

కంపుతో ఇబ్బందులు

రోజుల తరబడి రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండటంతో ఆ ప్రాంతానికి రాగానే తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో ఈ రహదారికి అనుకొని ఉన్న కాలనీలు వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా షాపుల్లో గిరాకీ తగ్గిందని నిర్వాహకులు చెబుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ట్రాఫిక్ జామ్ కష్టాలు

బాచుపల్లి చౌరస్తా నుంచి గండిమైసమ్మకు వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాచుపల్లి సిగ్నల్ దాటాలంటే దాదాపు 20 నిముషాలు పడుతుందని ఉద్యోగస్తులు, విద్యార్థులకు చెబుతున్నారు. స్కూల్, కళాశాలల బస్సులు, టిప్పర్లు వచ్చే సమయంలో వాటి వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు జరుగుతాయన్న ఆందోళనలో ఉంటున్నారు.

పథకాల అమలులో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు గ్యారంటీ పథకాల అమలులో చిత్త శుద్ధి లేదన్నారు బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి. శనివారం కొంపల్లిలోని అశోక–ఎలా–మైసన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు పరచడంలో విఫలమైందన్నారు. పింఛన్లు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకాకుండా ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన అభయహస్తం దరఖాస్తుల నమోదులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కొంపల్లి నుంచి బహదూరపల్లి వరకు ఉన్న రోడ్డుని 250 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు తగ్గిస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే ఉపసంహరించాలని కోరారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో హైరైజ్ భవనాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కబ్జా అయిన ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని, అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా నాయకురాలు సులోచన, గిరిజన మోర్చ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌రావు, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్, సెన్సార్ బోర్డ్ సభ్యుడు నటరాజ్ గౌడ్ ఉన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న హన్మంత్‌రెడ్డి

దుండిగల్: పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా గడ్డం విజయ్‌చంద్ర, జనరల్ సెక్రటరీగా దూసకంటి పద్మారావులను నియమించారు. ఈ సందర్భంగా నాయకులకు హన్మంత్‌రెడ్డి శనివారం నియామక పత్రాలు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి ఉన్నారు.

చైనా మాంజాను వినియోగించొద్దు



గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు

గచ్చిబౌలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గాలిపటాలను ఎగురవేయడానికి చైనీస్ మాంజాను ఉపయోగించొద్దని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు శనివారం ప్రజలను కోరారు. ప్రభుత్వం చైనీస్ మాంజా (థ్రెడ్)ను ఉపయోగించొద్దని దీన్ని నిషేధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది నాన్ బయోడిగ్రేడబుల్ అని, దీనితో పర్యావరణం, ప్రకృతిని కలుషితం చేస్తుందన్నారు. ఈ మాంజా సాంప్రదాయంలో ఉపయోగించే పత్తి కంటే సింథటిక్ పదార్థంతో తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. దీని వినియోగం ద్వారా మనుషులకేకాకుండా పక్షులు, జంతువులకు కూడా తగిలితే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఊహించని సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయన్నారు. దీన్ని చేతులతో కత్తిరించడం కూడా ఎంతో కష్టమని, దీని ద్వారా చేతులకు కూడా గాయాలయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. అందుకే ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజాను గాలిపటాలను ఎగురవేయడంలో ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆయన స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబంతో సంతోషంగా నిర్వహించుకోవాలని సాంప్రదాయబద్ధమైన వాటిని వినియోగించే పర్యావరణ, ప్రకృతి పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.

హెచ్‌సీయూకు నూతన అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

ఏబీవీపీ అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా సాక్షి



బాలకృష్ణ



సాక్షి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్ష, కార్యదర్శిని నియమించారు. ఏబీవీపీ నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కరుణాకర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణయ్య సమక్షంలో వీరిద్దరిని ఎంపిక చేశారు. ఏబీవీపీ నూతన అధ్యక్షుడు బాలకృష్ణ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. రెండు పోస్టుల్లోనూ పరిశోధక విద్యార్థులకు అవకాశం కల్పించడం విశేషం. వీరిద్దరిని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, సాక్షి మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. క్యాంపస్‌లోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అవకాశం కల్పించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు.

ముత్యాల ముగ్గుల పోటీలు



హఫీజ్‌పేట్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ సర్కిల్ – 21 పరిధిలోని బాలాజీ నిర్మల్ రత్నా అపార్ట్‌మెంట్స్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పీఏ నగర్‌లలో మహిళలకు ముగ్గుల పోటీలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవులు మాట్లాడుతూ.. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయడమన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రపరిచి, గోమయంతో కలాపి చల్లి, బియ్యపుపిండితో రకరకాల రంగవల్లులను కళాత్మకంగా మహిళలు తీర్చిదిద్దుతారన్నారు. ధనుర్మాసంలో బియ్యపుపిండి తినేందుకు చీమలుచేరి క్రిమికీటకాలను లోపలికి రాకుండా కాపాడతాయన్నారు. గోమయం వాసన వలన కూడా విషపూరితమైన కీటకాలు ఇంటి పరిసరాల్లోకి రావన్నారు. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా మానవులు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలకు జరిగే వ్యాయామంతో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని, వైద్య నివేదికలు చెబుతున్నాయన్నారు. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ కల్చర్ బాగా పెరిగిన తర్వాత మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్ తరానికి అందించడానికి, మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. చంద్రకళ, భీమమ్మ, శ్రీదేవి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్, రామారావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

గచ్చిబౌలి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కొండాపూర్ డివిజన్ కొత్తగూడలోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి అనగానే అందరికీ గుర్తొచ్చేవి ముగ్గులు, గాలిపటాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్థానికులు కేశం పుణ్యవతి, రఫియా బేగం, సంగీత, సునీత, షాహిజా, లక్ష్మమ్మ, రమాదేవి, రేవతి, లక్ష్మమ్మ, సుజాత, లావణ్య, పూజిత, సునీత, సరిత, మమత, శ్వేత, మాధవి, రాము, కుమార్, లక్ష్మణ్, ఖాసీమ్, యాదగిరి, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు గోదాదేవి కల్యాణం

జగద్గిరిగుట్ట: స్థానిక వేంకటేశ్వర స్వామి, గోవిందరాజ స్వామి, పద్మానగర్ ఫేజ్–1 లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో నేడు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉచితంగా మెడిసిన్ కిట్లు పంపిణీ

జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ కిట్లు ఉచితంగా అందజేస్తామని సంస్థ ఫౌండర్, ప్రెసిడెంట్ తూటి విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి అశోక చక్ర దివ్యాంగులు, వితంతు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులకు నిరంతం ఈ కిట్లు అందిస్తామన్నారు.

మార్కెట్‌లో గాలిపటాల సందడి



సుభాష్‌నగర్: సంక్రాంతిని పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల పక్కన గాలిపటాల షాపులు బిజీగా మారాయి. చిన్నారులను ఆకట్టుకునేలా వివిధ ఆకృతులలో గాలిపటాలతో పాటు, మంజాలు ఏర్పాటు చేశారు. వీటిని కొనుగోలు చేయడానికి చిన్న, పెద్ద అంతా ఆసక్తి చూపుతున్నారు.

జాతీయ కరాటే పోటీల్లో 'బూమ్స్' విద్యార్థుల ప్రతిభ

కుత్బుల్లాపూర్: బెంగళూరులో 'సెకై గోజు ర్యూ కరాటే డో స్పోర్ట్స్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో గాజులరామారం బూమ్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో తలపడ్డారు. వీరిలో బూమ్స్ అకాడమీకి చెందిన 14 మంది వివిధ విభాగాల్లోని 28 స్థానాల్లో పోటీ పడి 19 పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బూమ్స్ అకాడమీ శిక్షకుడు మాస్టర్ కృష్ణ మాట్లాడుతూ.. తమ విద్యార్థుల శ్రమకు తగిన ఫలితం దక్కిందన్నారు.

విద్యుత్ స్తంభాలకు చెట్ల కొమ్మలు

రంగారెడ్డినగర్: కరెంటు స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడంలో విద్యుత్ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. అంతేకాకుండా తొలగింపు పనుల నెపంతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న విద్యుత్ వైర్లకు తీగలు అల్లుకున్నాయి. రంగారెడ్డినగర్‌లోని పారిశ్రామికవాడకు వెళ్లే దారిలో ఓ పరిశ్రమ వద్ద విద్యుత్ వైర్లకు కొమ్మలు ఉండటంతో కరెంటు అంతరాయం ఏర్పడుతోంది.

కలుషిత తాగునీటిపై ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: కలుషిత తాగునీరు సరఫరా అవుతున్న జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ ఫేజ్–1 ప్రాంతాన్ని శనివారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి పర్యటించారు. తాగునీటి పైపులైన్‌లో మురుగునీరు వస్తోందని స్థానికులు చెప్పడంతో జలమండలి అధికారులతో మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా సమస్యని పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షుడు గొల్ల శ్రీను, మురళీ, సోమశేఖర్, శ్రవణ్ ఉన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని సమర్థించం



ఎమ్మెల్యేని కలిసిన లారీ డ్రైవర్ల అసోసియేషన్

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టాన్ని తీసుకొచ్చి లారీ డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మెల్యే వివేకానంద్ శనివారం అన్నారు. ఈక్రమంలో దేశ వ్యాప్తంగా డ్రైవర్లు చేపట్టే సమ్మెకు తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. తెలంగాణ లారీ డ్రైవర్ల అసోసియేషన్ ఐడీపీఎల్, చింతల్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి బంద్‌కు మద్దుతు ఇవ్వాలని కోరారు. దీనిపై వివేకానంద్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. న్యాయ సంహిత 106/2 హిట్ అండ్ రన్ చట్టాన్ని బీఆర్ఎస్ పార్టీ సమర్థించదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎల్లా కుమార్, సభ్యులు శివాజీ, లింగారెడ్డి ఉన్నారు.

రెడ్ ఎఫ్ఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

సనత్‌నగర్: రెడ్ ఎఫ్.ఎం సంస్థ ఆశీర్వాద్ మసాల ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్ శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బిగ్‌బాస్ సీజన్–7 పార్టిసిపెంట్ శోభాశెట్టి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ ఎఫ్.ఎం ఆర్జేలు రాజ్, చైతూ, శివ్, సూర్య మ్యూజిక్ ఎఫ్.ఎం ఆర్జేలు ప్రతీక, రవళి, సంగీత పాల్గొన్నారు.

జెక్‌కాలనీ అభివృద్ధికి కృషిచేస్తా

సనత్‌నగర్: జెక్‌కాలనీ అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు శనివారం కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఆదివారం సంతతో వ్యాపారులు కాలనీలోకి చొచ్చుకు రావడం మూలంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాహనాలతో రోడ్లన్నీ నిండిపోతున్నాయన్నారు. అదే విధంగా కాలనీలో పలురోడ్లు అధ్వానంగా మారాయని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదని వినతిలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంక్రాంతి తర్వాత జెక్‌కాలనీ సమస్యల పరిష్కారం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ తెలిపారు.

పండగ సెలవుల్లో దర్జాగా కబ్జా

గ్రంథాలయం, ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన స్థలం కబ్జా

ఆల్విన్‌కాలనీ: గ్రంథాలయం, ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని పండుగ సెలవులు కావటంతో భూకబ్జాదారులు కబ్జా చేశారు. శనివారం కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీని ఆనుకొని ఉన్న రైతు బజార్ వెనుక భాగంలోని సర్వే నెంబర్336లో గల ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు యథేచ్ఛగా కబ్జాకు పాల్పడుతున్నారని తెలవడంతో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి కబ్జా జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. జగద్గిరిగుట్ట పోలీసుల సహాయంలో జేసీబీని తీసుకువచ్చి కూల్చివేయటానికి ప్రయత్నించటంతో కబ్జాదారుడు అడ్డుకున్నాడు. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కబ్జాదారులను హెచ్చరించారు.పదేళ్ల క్రితం ఫైర్‌స్టేషన్, గ్రంథాలయం కోసం ఈ స్థలాన్ని కేటాయించారు. రైతు బజార్‌కు కేటాయించిన స్థలంలో రైతు బజార్ నిర్మాణం పూర్తి అయింది. మిగిలిన స్థలంలో గ్రంథాలయం చేపట్టకుండా ఖాళీగా ఉండటంతో కబ్జాదారుల కన్ను పడింది. సంక్రాంతి పండుగను అదనుగా చూసి నిర్మాణాన్ని చేపట్టారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన పట్టాలను చూపి కబ్జా చేసేందుకు పూనుకుంటున్నారని, తప్పుడు ఇంటి నెంబర్లు సృష్టించి నిర్మాణాలకు పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడి ఇక్కడి ప్రజల అవసరాలకు కేటాయించిన స్థలంలో గ్రంథాలయం, ఫైర్ స్టేషన్, ఇతర అవసరాలకు ఉపయోగించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కబ్జా చేస్తే చర్యలు : ఆర్ఐ శ్రీనివాసరెడ్డి

తప్పుడు ధృవపత్రాలు చూపించి ప్రభుత్వ స్థలాలను కబ్జాకు పూనుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గతంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలైన గ్రంథాలయం, రైతు బజార్, ఫైర్ స్టేషన్‌లకు కేటాయించాం. నిర్మాణాలు చేపట్టడానికి జాప్యం జరిగింది. ఈ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు తప్పవు.



రైతుబజార్ వద్ద ప్రభుత్వ భూమిలో కబ్జాకు గురైన నిర్మాణం

సైకిల్‌పై అయోధ్యకు బయలుదేరిన రామ భక్తులు




మోతీనగర్: అయోధ్య రామ మందిర నిర్మాణం శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం దేశ ప్రజల చిరకాల వాంఛ అని గురుస్వామి పవన్ తెలిపారు. మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌కు చెందిన మానుక సాయి యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న అయోధ్యలో జరిగే శ్రీ రామ మందిర ప్రారంభం కార్యక్రమానికి సైకిల్ యాత్రతో శనివారం బయలుదేరి వెళ్లారు. అభినాయక్, తిరుమల్లేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



కూకట్‌పల్లి: బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నివాసముండే వి. నరసింహ మూర్తికి శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లక్ష రూపాయలకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని కోరారు.

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో మూసాపేట నాయకులు గోపిశెట్టి రాఘవేందర్, సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం పాండురంగ నగర్‌కాలనీ మాజీ అధ్యక్షులు, బీఆర్‌యస్ పార్టీ సీనియర్ నాయకుడు సర్దార్ ఇంద్రజీత్ సింగ్‌తో పాటు 30 మంది బీఆర్‌యస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బండి రమేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభుత్వ స్థలంలో మద్యం బాటిళ్లు డంప్



రంగారెడ్డినగర్: ఏపీ హెచ్‌బీ కాలనీలోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డు స్థలంలో ఒకవైపు అక్రమ పార్కింగ్, మరోవైపు కబ్జాలు కొనసాగుతున్నాయి. ఈ స్థలంలో మెట్‌కానిగూడ రోడ్డుకు ఆనుకున్న ప్రాంతాన్ని ఓ వ్యక్తి మద్యం బాటిళ్ల సీసాల బస్తాలు డంప్ చేస్తున్నాడు. దీనిపై అధికారులు సైతం చర్యలు తీసుకోవట్లేదని స్థానికులు చెబుతున్నారు.

నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



మోతీనగర్: సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించవలసిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని నీలిమ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్. పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలిచిన మహిళలకు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాస్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమలు నగదు బహుమతిని అందజేశారు.

మేయర్‌కు అభినందనల వెల్లువ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షన్–2023 అవార్డు అందుకున్న నేపథ్యంలో మేయర్ నీలారెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజ్, కాసాని సుధాకర్ ముదిరాజ్‌తో పాటు బాచుపల్లికి చెందిన పాస్టర్లు, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంత మహిళలు మేయర్‌ను శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ ముదిరాజ్ మహాసభ నూతన సంవత్సర కేలండర్‌ను మేయర్ ఆవిష్కరించారు.